క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



నగరంపాలెం: హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం అందజేశారు. గతనెల 18న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ దేవరపల్లి రమేష్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్, చేయూత కింద మంజూరైన రూ.1.75 లక్షల చెక్కును రమేష్ సతీమణి జ్యోతికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ సిబ్బంది రమాదేవి, పవన్, జిల్లా పోలీసు సంఘం సభ్యులు కరిముల్లా, లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో తాగునీటి సమస్య లేకుండా, అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో నిర్వహించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు కోరారు. నగరపాలక సంస్థ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన కె.నాగమల్లేశ్వరరావు, నగర మేయర్‌ని సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అధికారులకు తమ పాలకవర్గం అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉంటాం



నెహ్రూనగర్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులకు అండగా ఉంటామని ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ తెలిపారు. గుంటూరు 2 డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ మరణించిన జె.నరసింహారావు కుటుంబ సభ్యులకు ఆర్టీసీ తరపున నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రూ.3,82,739 చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

జూదరుల అరెస్ట్

లక్ష్మీపురం: ఓ ఇంట్లో పేకాటాడుతున్న పలువురిని పోలీసులు మంగళవార అరెస్ట్ చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. గౌతమి నగర్ 6వ లైన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఏడుగురు పేకాటాడుతున్నట్లు సమాచారం వచ్చింది. ఎస్ఐ రోజాలత పేకాట శిబిరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.37,490, ఏడు సెల్‌ఫోన్‌లు, 6 బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: వ్యక్తి అదృశ్యంపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కొత్తపేట శీలంవారి వీధికి చెందిన ఎం.శ్రీనివాసరావు ఖాళీగా ఉంటాడు. ఆరేళ్ల క్రితం భార్య చనిపోయింది. పిల్లలేరు. ఈనెల 13 ఉదయం అల్పాహారం చేసేందుకు బయటకెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద ఆరాతీసిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తమ్ముడు కనిపించడంలేదని అన్న మనోరంజన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసలు తెలిపారు.

పెరుగుతున్న గ్యాస్ మంట

- ఆధునిక జీవన శైలితో మార్పు
- జీజీహెచ్‌కు క్యూ కడుతున్న బాధితులు



గుంటూరు మెడికల్: ఉరుకులు పరుగుల జీవితం. ఆధునిక జీవనశైలి ఫ్యాషన్ అయింది. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం తీసుకోవడం. అది కూడా ఫాస్ట్ ఫుడ్స్, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం. తద్వారా అనేక మంది గ్యాస్ సంబంధిత సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. గ్యాస్ వల్ల ఛాతిలో మంట, గుండెలో మంట వస్తుండటంతో గుండె పోటు వస్తుందేమోననే భయంతో అనేక మంది వైద్యులకు వద్దకు పరుగులు తీస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ ఛాతిలో మంట బాధితుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కారణాలు..

ఛాతిలో మంట రావడానికి జీఈ జంక్షన్ ద్వారం వదులుగా మారడం వల్ల ఛాతిలో మంట వస్తుంది. ధూమపానం, ఆల్కాహాల్ వలన ద్వారం వదులుగా మారుతోంది. పొట్ట బిగుతుగా ఉండటం వల్ల(కడుపునిండుగా తినడం వల్ల), బిగుతు దుస్తులు, పొట్ట బిగుతు చేసే వ్యాయామం వలన ఛాతిలో మంట వస్తుంది. ఆహారం తిన్న తరువాత రెండు గంటల్లోపు వెళ్లికలా పడుకోవడం లేదా ముందుకు వంగడం వంటి పనులు చేయడం వల్ల, పొట్టలోని ఆహారం థైరాయిడ్, షుగర్ వలన, ఆలస్యంగా ముందుకు కదలడం వల్ల ఛాతిలో మంట వస్తుంది.

లక్షణాలు..

గుండెలో మంట, తేపులు, నోటిలో లాలాజలం ఊరడం, గుండెలో, గొంతులో పట్టినట్లు ఉండటం, గొంతులో ఏదో అడ్డుపడినట్లు ఉండటం, గొంతు మంట, గొంతు బొంగరుపోవుట, చెవి, గొంతు, పంటి నొప్పి, గ్యాస్ పైకి తన్నడం, దీర్ఘకాలిక దగ్గు, నోటి దుర్వాసన, రిఫ్లక్స్ గ్యాస్ సమస్య వల్ల కొంత మందికి ఆయాసం కూడా వస్తుంది.

పాటించాల్సిన ఆహార నియమాలు

బిర్యానీలు, చాక్లెట్లు, పచ్చి ఉల్లిపాయలు, మసాలా పదార్థాలు, కాఫీ, నిమ్మరసం, టమోటా సాస్ తగ్గించాలి. ధూమపానం, ఆల్కాహాల్, గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్, నొప్పి మాత్రలు, ఊరగాయ పచ్చళ్లు, తిన్న వెంటనే పడుకోవడం పూర్తిగా మానేయాలి.

రిఫ్లక్స్ సమస్య..

సాధారణంగా మనం నోటితో తీసుకున్న ఆహారం ఆహార నాళం ద్వారా కిందకు వెళ్లి పొట్టలోకి చేరుతోంది. ఆ ఆహారం రెండు గంటలపాటు పొట్టలో ఉండి, పొట్టలోని యాసిడ్‌తో కలసి పొట్ట కదలికలతో చిన్న చిన్న ముక్కలుగా చేయబడి తరువాత పైలోరస్ ద్వారం దాటి చిన్నపేగులోకి వెళ్తోంది. కొన్ని కారణాల వలన పొట్టలో ఉన్న యాసిడ్‌తో కలిసిన ఆహారం జీఈ జంక్షన్ ద్వారం దాటి మళ్లీ వెనుకకు పైన ఉన్న ఆహార నాళంలోకి రిఫ్లక్స్ అవుతోంది. తద్వారా రోగికి ఛాతిలో మంట, తేపులు, గొంతులో మంట వస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. కొంచెం కొంచెం ఆహారం ఎక్కువ సార్లు తినాలి. తిన్న తరువాత రెండు గంటల వరకు నిటారుగా కూర్చొని లేదా నిలబడి చేసే పనులు చేయాలి. తిన్న తరువాత రెండుగంటల వరకు వంగి చేసే పనులు ఏమి చేయకూడదు. వేగంగా నడక, సైకిల్ తొక్కడం వంటి వ్యాయామాలు చేయాలి. ఆహార నియమాలు పాటించాలి. పొట్ట పెరగకుండా ఉండేటట్లు చూసుకోవాలి. బరువు తగ్గించుకోవాలి. తల ఎప్పుడూ సాధ్యమైనంత ఎత్తు పెట్టుకుని పడుకోవాలి.

గుంటూరు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



రిఫ్లక్స్ గ్యాస్ సమస్య బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతిఏడాది గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జీవన శైలి మార్చుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. రిఫ్లక్స్ అనేది షుగర్, బీపీలాగా దీర్ఘకాలిక వ్యాధి. జాగ్రత్తలు పాటిస్తూ అప్పుడప్పుడు మందులు వాడితే ఇబ్బంది ఉండదు. జాగ్రత్తలు తీసుకోకపోతే అల్సర్లు, కేన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వస్తాయి.

–డాక్టర్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్

అర్హులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

వైఎస్సార్ సీపీ నాయకుడు గౌతమ్‌రెడ్డి



గౌతమ్‌రెడ్డిని సత్కరిస్తున్న బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు

నగరంపాలెం: అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి కోరారు. గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు అనేది చాలా విలువైనదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఓటరూ బాధ్యత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, గుమస్తాలు, కక్షిదారులను ఓట్లు వేయాలని కోరారు. అనంతరం గౌతమ్‌రెడ్డిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, కేశవర్ధన్‌రావు, సుబ్రహ్మణ్యం, గుండు శ్రీను, రఘురామిరెడ్డి, మంజుల, మాధవి, వెంకటరమణ పాల్గొన్నారు.

18న సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

లక్ష్మీపురం: విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.8,100 కోట్లు విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలు చేసి ప్రజలపై భారాలు మోపే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రతిపాదనను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క విద్యుత్ ఛార్జీలు పెంచాలని చూడడం సరికాదన్నారు.

నేటి నుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం నుంచి 90 రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టనున్నామని, అందుకు తగిన విధంగా స్పెషల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులను ప్రాంతాలు, గృహాల వారీగా రేషనలైజేషన్, మ్యాపింగ్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, స్పెషల్ శానిటేషన్ పర్యవేక్షణ అధికారులు, ప్రజారోగ్య అధికారులతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

పెదకాకాని: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ టి.కృష్ణకాంత్ అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, తరలింపు వంటి అంశాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ కె.నారాయణ స్వామి, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సివిల్ సప్లయి డీటీ వెంకట్రావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

నెహ్రూనగర్: దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతమాత కన్న ముద్దు బిడ్డలలో అబ్దుల్ కలాం రత్నం వంటి వారిని కొనియాడారు. దీక్ష పట్టుదల ఉంటే సామాన్యుడు ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని నిరూపించిన గొప్ప మానవతావాది అబ్దుల్ కలాం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మస్తాన్ రెడ్డి, కె.గోపిరెడ్డి, షేక్ వలి, పరిపూర్ణ, బ్రహ్మయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మోదుగుల

అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు మెడికల్: డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు మరువలేనివని డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. కొత్తపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ శనక్కాయల అరుణ పాల్గొన్నారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ పేపర్ బాయ్ నుంచి శాస్త్రవేత్త, రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల రాజ కుమారి, సురేష్ కుమార్ జైన్ పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బీజేపీ కార్యాలయంలో..

గుంటూరు మెడికల్: బీజేపీ కార్యాలయంలో గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్య దర్శి సాంబశివరావు ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అ బ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ గౌస్ పీరా, జోనల్ ఇంచార్జ్ షేక్ రఫీ, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హేమంత్ జైన్, షేక్ మౌలాలి పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కన్నా మాస్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

గుంటూరు ఎడ్యుకేషన్: సామాన్య కుటుంబం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన అబ్దుల్ కలాం విద్యార్థులకు ఆదర్శనీయుడని కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు. కన్నా మాస్టారు మాట్లాడుతూ కలాం జీవిత చరిత్ర ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని, విద్యార్థులు కలాంను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు.

‘గణతంత్ర’ పరేడ్ శిక్షణకు విద్యార్థి ఎంపిక



అనుదీప్‌కృష్ణను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: గణతంత్ర దినోత్సవ పరేడ్ శిక్షణ శిబిరానికి శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల 9వ తరగతి విద్యార్థి తంగెళ్లపల్లి బోసు అనుదీప్‌కృష్ణ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ నిర్వహించిన క్యాంప్‌లో భాగంగా ఎన్‌సీసీ కేడెట్లకు జరిగిన ఎంపిక ప్రక్రియలో తమ విద్యార్థి ఇన్‌స్ట్రుమెంటల్ విభాగంలో ప్రతిభ చూపి సికింద్రాబాద్‌లో జరగనున్న ఆర్డీసీ క్యాంప్‌కు అర్హత పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ వాసిరెడ్డి శివనాగమల్లేశ్వరి, కోచ్ రాంబాబు పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ఆతుకూరి వీర రాఘవ పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవ సభ, వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన మహోత్సవాలకు సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ విద్వాంసురాలు లలితా చంద్రశేఖర్ (వైజాగ్) శాస్త్రీయ సంగీత కచేరి భైరవి రాగంలో అటతాళవర్ణంతో ప్రారంభించారు. పలు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించగా, సంగీతాభిమానులను అలరించాయి. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరకా సురేష్‌బాబు వాయిద్యా సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, వై.రాజ్యలక్ష్మి, ఫణి తేజ పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులకు కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు, సొంతంగా నిర్మాణం చేసుకునే వారు డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో కలసి హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నాయి.. మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను లే అవుట్ల వారీగా ఎమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలని కోరారు. అలాగే సొంతంగా నిర్మాణం చేసుకునే వారు కూడా త్వరగా చేసుకునేలా తోడ్పాటుని అందించాలని చెప్పారు. స్థల లబ్ధిదారుల్లోని డ్వాక్రా సభ్యులకు బ్యాంక్‌ల నుంచి రూ.35 వేలు రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. ప్రతి లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులపై నోడల్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, ఉపా సెల్ పీఓ బాలాజీ బాషా పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డాక్టర్ షమ సుల్తానా



చందు సాంబశివరావును సత్కరిస్తున్న డాక్టర్ షమ సుల్తానా, తదితరులు

గుంటూరు మెడికల్: యువత భవిష్యత్ తరాల పారిశ్రామికవేత్తలుగా అడుగులు వేయాలని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) ఉమెన్ వింగ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీలోని పీకాక్ ప్రాంగణంలో ‘ది ఎంటర్ ప్రెన్యూర్షిప్ జర్నీ వర్సెస్ ఐపీఆర్’ (ఎ చాలెంజింగ్ సక్సెస్ ఫుల్ కెరీర్)పై సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి డాక్టర్ షమ సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్రో సైంటిస్ట్ చందు సాంబశివరావుకు అవార్డు అందజేశారు. ఇతర ప్రముఖులకు ఆమె శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ భవిష్యత్ తరాల వ్యాపారవేత్తలకు ఇటువంటి సమావేశాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. సమావేశంలో ఎన్నారై గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు పిడికిటి, ఎనలిస్ట్ శేషుబాబు కానూరి, మాజీ జాయింట్ కమిషనర్(జీఎస్టి) తమ్మిరెడ్డి శివ శంకర్, ఎంఎస్ఎంఈ అండ్ బిజినెస్ కన్సల్టెంట్స్ పార్టనర్ సీపీ పర్వేజ్, లీడింగ్ ఎడ్జ్ విజన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్, గ్లోబల్ ఐటీ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్(తిరుపతి) కె. వెంకట కామేష్, శ్రీ విజ్ఞాన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.ప్రసాద్, ఎంఎస్ఎంఈ ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవరావు, గిరిధర్ పాల్గొన్నారు.

స్విమ్మర్‌ను అభినందించిన నగర కమిషనర్



పారా స్విమ్మర్ దేవేంద్రను అభినందిస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన పారా స్విమ్మర్ దేవేంద్ర జాతీయ స్థాయి పారా ఈత పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో కోచ్ ఎస్.కె. ఖాజా మొహిద్దీన్, స్విమ్మర్ దేవేంద్రలను కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 6వ పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్-2024లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన పారా స్విమ్మర్ దేవేంద్ర సీనియర్ పురుషుల విభాగంలో ఎస్.5 కేటగిరిలో పాల్గొని 2 బంగారు, 1 వెండి పతకాలు గెలుచుకున్నారన్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్-2024 పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. ఆ పోటీల్లో కూడా రాణించి గుంటూరు నగరానికి పేరు ప్రఖ్యాతాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సమాజానికి విశిష్ట సేవలు అందించిన రంగారావు



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజానికి విశిష్ట సేవలు అందించిన రాయపాటి వెంకట రంగారావు చిరస్మరణీయుడని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో మంగళవారం రాయపాటి వెంకట రంగారావు జయంతి సందర్భంగా రంగారావుతో పాటు సీతారామమ్మ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, ప్రిన్సిపాల్ మోటూరి రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌లో వివా విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 9 సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివా ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థి బొల్ల సత్యేంద్ర, 6వ తరగతి విద్యార్థి బానాల ఇషాన్లు ప్రతిభ కనపరచి గుంటూరు జిల్లా జట్టు కాంస్య పతకాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. క్రీడలు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. 9 మంది వ్యాయామోపాధ్యాయులతో క్రీడల్లో శిక్షణ ఇస్తోందన్నారు. రామచంద్రాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన బొల్ల సత్యేంద్ర, బానాల ఇషాన్లను, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎలీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ఐబీ సంధానకర్త కె.మాధవి, ఎస్సీ ఎస్సీ సంధానకర్త జ్యోతి మెట్లా, బాస్కెట్‌బాల్ కోచ్ టి.అనిల్‌కుమార్ అభినందించారు.